సాక్షి
పెద్దపల్లి
మంగళవారం । 28 । ఫిబ్రవరి । 2023



హాస్టల్‌లో భోజనం తినలేకపోతున్నాం..!

పెద్దపల్లి శివారు రంగంపల్లిలోని బాలుర కళాశాల హాస్టల్ విద్యార్థులు సోమవారం రాత్రి రోడ్డెక్కారు. ధర్నా చేసేందుకు సిద్ధమయ్యారు. 8లో▸



కరాటే శిక్షణ.. ఆత్మ రక్షణ

విద్యార్థినుల్లో ఆత్మస్థైర్యం నింపేందుకు కరాటేలో మెలకువలు నేర్పేందుకు పాఠశాలల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
34.0/19.0

వాతావరణం

ఎండవేడి మరింత పెరుగుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతకు గురయ్యే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

వేధింపులపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

- సివిల్ జడ్జి ఆర్.రాజ్‌కుమార్



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి రాజ్‌కుమార్

గోదావరిఖనిటౌన్: జూనియర్ విద్యార్థులు ర్యాగింగ్‌పై అప్రమత్తంగా ఉండాలని గోదావరిఖని సీనియర్ సివిల్ జడ్జి ఆర్.రాజ్‌కుమార్ అన్నారు. సోమవారం ఓ ప్రైవేటు స్కూల్‌లో జరిగిన న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడారు. మహిళలపై పెరుగుతున్న అఘాయిత్యాల పట్ల ప్రతి మహిళా అప్రమత్తంగా ఉండాలని, తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. గోదావరిఖని బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు సీహెచ్.శైలజ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సోషల్ వర్కర్ మిట్టపల్లి శంకర్, డిస్ట్రిక్ట్ చీఫ్ లీగల్ హెడ్ కౌన్సిల్ నుచ్చు శ్రీనివాస్, పాఠశాల ప్రిన్సిపల్ సీబా సువర్ణరాణి, కళాశాల డీన్ శ్రీనివాస్, ఏఓ సందీప్, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ డైరీ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరణలో మంత్రి, జెడ్పీ చైర్మన్

పెద్దపల్లిరూరల్: జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో రూపొందించిన డైరీని సోమవారం రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో ఆవిష్కరించారు. జిల్లా సమగ్ర సమాచారంతో డైరీని రూపొందించడంపై జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్‌ను అభినందించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ రేణుక, పద్మజ, బండారి రామ్మూర్తి, గంట రాములు తదితరులున్నారు.

ఆస్తిపన్ను వసూళ్లపై అధికారుల స్పెషల్ డ్రైవ్



ఆస్తి పన్ను చెల్లించని ఇంటికి నల్లా కనెక్షన్ తొలగిస్తున్న కార్పొరేషన్ అధికారులు

కోల్‌సిటీ: ఆస్తి పన్ను వసూళ్లపై కార్పొరేషన్ అధికారులు సోమవారం నుంచి స్పెషల్ డ్రైవ్ ప్రారంభించారు. నెల రోజుల్లో ఈ ఆర్థిక సంవత్సరం ముగియనున్న నేపథ్యంలో ఆస్తిపన్ను వసూళ్లలో వేగం పెంచారు. ఆస్తి పన్నులు, నల్లా బిల్లులు, లైసెన్స్ ఫీజులు చెల్లించాలని పారిశుధ్య వాహనాలకు మైకులు అమర్చి ప్రచారం చేయిస్తున్నారు. కమిషనర్ బి.సుమన్‌రావు ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారి రాయలింగు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు కరుణాకర్, శంకర్‌రావు వివిధ డివిజన్లలో స్పెషల్ డ్రైవ్ చేపట్టి పన్ను వసూళ్ల తీరును పర్యవేక్షించారు. మొండి బకాయిలు ఉన్న వారికి ఇదివరకే నోటీసులు జారీ చేశారు. నోటీసు ఇచ్చినా స్పందించని వారి నల్లా కనెక్షన్ తొలగించడానికి చర్యలు తీసుకున్నారు. పన్ను చెల్లించని వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

వారం పాటు మహిళా దినోత్సవాలు

- కలెక్టర్ సంగీత

పెద్దపల్లిరూరల్: జిల్లాలో మహిళా దినోత్సవాలను వారం పాటు నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ సంగీత తెలిపారు. మార్చి ఒకటి నుంచి 8 వరకు వినూత్న పద్ధతుల్లో లింగసమానత్వ సాధనకు కృషి చేయడమే కార్యక్రమం ఉద్దేశమని పేర్కొన్నారు.

- **మార్చి ఒకటిన:** లింగసమానత్వం, మహిళా హక్కులపై గ్రామ, మండల, జిల్లాస్థాయిలో అవగాహన కార్యక్రమాలు.
- **2న:** లింగసమానత్వంపై విస్తృతప్రచారం, బాలికలు, మహిళలపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా అవగాహన కల్పించడం, టోల్‌ఫ్రీ నంబరు ప్రచారం.
- **3న:** జిల్లాలోని జూనియర్, డిగ్రీ కాలేజీల్లో, కలెక్టరేట్‌లోని మహిళా ఉద్యోగులకు డ్రాయింగ్, వ్యాసరచన, పాటలు, రంగోలి పోటీలతోపాటు డిబేట్ నిర్వహించడం.
- **4న:** లింగ సమానత్వం, మహిళాహక్కులు, చట్టాలపై మండలస్థాయిలో వర్క్‌షాప్ నిర్వహణ.
- **6న:** మహిళలు, బాలికలపై హింస నిర్మూలన, సమసమాజ స్థాపనకు ప్రమాణం చేస్తూ సంతకాల సేకరణ.
- **మార్చి8న:** మహిళా దినోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో కృషి చేస్తున్న మహిళలకు గ్రామ, మండల, జిల్లా స్థాయిలో సన్మానం ఉంటుందని కలెక్టర్ సంగీత వివరించారు.

ఎండుతున్న పంటలు..!

- వారబందీతో చివరి భూములకు చేరని నీళ్లు
- నెర్రెలు బారుతున్న వరి పొలాలు
- తడుల కోసం అన్నదాతల కష్టాలు
- ఆందోళనలో చివరి ఆయకట్టు రైతులు



కాల్వశ్రీరాంపూర్ మండలంలో ఎండిపోయిన వరి పొలాలు

సాక్షి, పెద్దపల్లి: ఎప్పటిలాగే ఈ ఏడు కూడా చివరి ఆయకట్టుకు నీరందక.. పంటలు ఎండుతుండటంతో అన్నదాతలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మండుతున్న ఎండలతో భూగర్భజలాలు రోజురోజుకూ పడిపోతున్నాయి. పంటలను కాపాడుకునేందుకు ఏం చేయాలో తెలియక రైతులు దిక్కులు చూస్తున్నారు. ఈ ఏడాది కురిసిన భారీ వర్షాలకు తోడు.. ఎస్సారెస్పీ కాలువల పూడికతీత, ముళ్లపొదల తొలగింపుతో చివరి ఆయకట్టుకు నీరు అందుతుందన్న ఆశతో అన్నదాతలు వివిధ పంటలు సాగు చేశారు. జిల్లాలో యాసంగిలో 1,92,406 ఎకరాల్లో వరి, 10,430 ఎకరాల్లో మిగిలిన పంటలు సాగు చేశారు. వరి పొట్టదశకు చేరింది. తీరా చేతికొచ్చే సమయంలో నీరు లేక ఎండిపోతుండటంతో రైతులు ఆగమవుతున్నాయి.

ఆటోమెటిక్ స్టార్టర్ల తొలగింపు



ఒక్కపక్క సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతుంటే.. మరోపక్క బావుల ద్వారా సాగు చేసుకుంటున్న రైతుల పరిస్థితి మరోలా ఉంది. అప్రకటిత కరెంట్ కోతలతో పంటలకు నీరందక ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. బావుల వద్ద ఉన్న ఆటోమెటిక్ స్టార్టర్లను విద్యుత్‌శాఖ అధికారులు తొలగిస్తున్నారు. ఫలితంగా పొలాల వద్దనే పడిగాపులు కాస్తూ కరెంట్ వచ్చినప్పుడు మోటార్లు ఆన్ చేస్తూ తడులు ఇస్తున్నారు.

వారబందీతో ఆగమాగం

జిల్లాలో ఎస్సారెస్పీ డీ–83 పరిధిలో 1,03,339 ఎకరాలు ధర్మారం, జూలపల్లి, పెద్దపల్లి, సుల్తానాబాద్, కాల్వశ్రీరాంపూర్, రామగుండం, మంథని, కమాన్‌పూర్, ముత్తారం, పాలకుర్తి, అంతర్గాం, రామగిరి, ఎలిగేడు మండలాల్లో.. డీ–86 పరిధిలో 89,660 ఎకరాలు జూలపల్లి, ధర్మారం, ఎలిగేడు, సుల్తానాబాద్, ఓదెల, కాల్వశ్రీరాంపూర్, పెద్దపల్లి మండలాల్లో ఆయకట్టు ఉంది. డీ–83, డీ–86 కాలువల కింద నీటిని వారబందీ (8 రోజులు ఆన్.. 7 రోజులు ఆఫ్) పద్ధతిలో విడుదల చేస్తున్నారు. ఎస్సారెస్పీ నీటిని పైన ఉన్న గ్రామాల్లో రైతులు గండికొట్టి చెరువులు నింపుకోవడం, మోటార్ల ద్వారా నీటిని తోడేయడం చేస్తున్నారు. దీంతో ప్రధానంగా కాల్వ శ్రీరాంపూర్, ఓదెల, ముత్తారం తదితర మండలాల్లోని చివరి ఆయకట్టు గ్రామాలకు నీరు అందక పొట్టదశలో వరి పొలాలు ఎండుతున్నాయి.

కౌలు రైతు కుదేలు..

పొలాలను కౌలుకు తీసుకుని వరిసాగు చేస్తున్న రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే ఎకరాకు సుమారు రూ.25వేలకు పైగా (దున్నకం, నాటు, కలుపుమందు, ఎరువులు, కూలీలు, ఇతరత్రా) పెట్టుబడి పెట్టారు. ఇప్పుడు నీరు లేక పొలం ఎండిపోతుండటంతో ఆ భారం ఎలా పూడ్చుకోవాలో తెలియక మనస్తాపానికి గురవుతున్నారు. పెట్టిన పెట్టుబడి రాకపోతే అప్పులపాలవడం తప్ప మరోదారి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చివరి పొలాలకు నీరివ్వాలి



గతంలో టేల్ టు హెడ్ పద్ధతిలో కాలువ నీరు వచ్చేది. దాంతో అందరికీ నీళ్లు అందేవి. ఇప్పుడు అలా జరగడం లేదు. అధికారులు శ్రద్ధ తీసుకుని మొదట చివరి భూములకు నీరు అందించి పిదప ఎగువన ఉన్న రైతులకు నీరు ఇస్తే అందరికీ సమానంగా నీరందుతుంది. అధికారులు ఈ విషయమై చర్యలు తీసుకోవాలి.

– అగ్గిమల్ల రాజయ్య, రైతు, కాల్వ శ్రీరాంపూర్

పంటలు ఎండుతున్నాయి



మాది కాల్వశ్రీరాంపూర్ మండలం ఇద్దులాపూర్. అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో ఎస్సారెస్పీ నుంచి వచ్చే నీటిని ఎగువన ఉన్న గ్రామాల వారు గండ్లు పెట్టి చెరువులు నింపుకుంటున్నారు. దీంతో చివరి ఆయకట్టు పొలాలు నీరందక పొట్టదశలో ఎండిపోతున్నాయి.

– ధార సదానందం, రైతు, కాల్వశ్రీరాంపూర్

బోర్లలో నీరు పడడం లేదు



ఎస్సారెస్పీ కాలువలను ముళ్లపొదలు తొలగించి పూడికతీసి నీళ్లు పారేలా చేశారు. వారబందీ కారణంగా పొలాలకు సరిగా చేరడం లేదు. ఆ నీటిని ఎగువన ఉన్న గ్రామాలవారు మోటార్ల ద్వారా తోడేస్తున్నారు. దీంతో చివరి ఆయకట్టుకు నీరందక పొట్ట దశలో పొలాలు ఎండిపోతున్నాయి.

– నల్లా కేశవరెడ్డి, రైతు

నీరందేలా చర్యలు తీసుకుంటాం

జిల్లాలో డీ–83, 86 కాలువల కింద పూర్తి స్థాయిలో పంటలకు ఎస్సారెస్పీ నీరు అందించేందుకు చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే 6వేల క్యూసెక్కుల నీరు పైనుంచి విడుదల అయ్యింది. చివరి ఆయకట్టు వరకూ నీరు అందనుంది. కాలువల కింద ఉన్న పంటలు ఎండిపోకుండా వారబందీ ప్రకారం నీటిని విడుదల చేస్తున్నాం.

– సత్యరాజ్‌చంద్ర, జిల్లా జలవనరుల శాఖ, ఎస్ఈ

ప్రీతికి మెడికోల నివాళి



కోల్‌సిటీ/ఫెర్టిలైజర్‌సిటీ: వైద్య విద్యార్థిని ప్రీతి మృతికి రామగుండం వైద్య కళాశాల విద్యార్థులు సోమవారం నివాళులర్పించారు. ప్లకార్డులతో కార్పొరేషన్ టీ జంక్షన్‌కు చేరి ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. ఎవరూ ఆత్మహత్య చేసుకోవద్దని, మనోధైర్యంతో ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. 39వ డివిజన్ గౌతమినగర్‌లోని బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా కార్యవర్గ సభ్యురాలు, గౌతమిరూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ అధ్యక్షురాలు సోమారపు లావణ్య ఆధ్వర్యంలో ప్రీతికి కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. శిరీష, సుజాత, మౌనిక, నవత, గాయత్రి, శారదా పాల్గొన్నారు.



సాగునీటి కోసం రైతుల ఆందోళన

- నెల క్రితమే విన్నవించిన అన్నదాతలు
- ఈఈని ఆదేశించిన కలెక్టర్
- అయినా స్పందించని అధికారులు
- గత్యంతరం లేక ధర్నాకు దిగిన రైతులు



డీఈ ఆఫీస్ ముందు ఆందోళన చేస్తున్న రైతులు

సుల్తానాబాద్: తమ పొలాలకు సాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ.. సుల్తానాబాద్, ఓదెల, పెద్దపల్లి మండలాలకు చెందిన రైతులు సుల్తానాబాద్ పట్టణంలోని ఎస్సారెస్పీ కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళనకు దిగారు. తమ పొలాలు ఎండుతున్నాయని, సాగునీరు విడుదల చేయాలని సుల్తానాబాద్ మండలం ఇందిరానగర్, రేగడిమద్దికుంట, మల్లయ్యపల్లి, ఓదెల మండలం ఉప్పరపల్లి, పెద్దపల్లి మండలం కొత్తపల్లి రైతులు డిమాండ్ చేశారు. తమ పొలాలు కాపాడాలని కోరుతూ కలెక్టర్‌కు నెలక్రితమే ఫిర్యాదు చేశామని, ఆమె స్పందించి నీరు అందేలా చూడాలని ఎస్సారెస్పీ ఈఈని ఆదేశించారని, అయినా తమకు న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. డీఈకి ఫోన్ చేస్తే దుర్భాషలాడుతున్నారని, పోలీస్‌స్టేషన్లలో కేసులు పెడతామని బెదిరిస్తున్నారని విమర్శించారు. ధర్నా విషయం తెలుసుకున్న ఉన్నతాధికారులు సంఘటన స్థలానికి చేరుకుని సమస్యను రెండురోజుల్లో పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై ఉపేందర్‌రావు బందోబస్తు ఏర్పాటు చేశారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మల్యాల సంజీవ్ గౌడ్, రవి, శ్రీనివాస్, కనకయ్య పాల్గొన్నారు.

రూ.2 లక్షల రుణమాఫీ చేస్తాం

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎంఎస్.రాజ్‌ఠాగూర్



మంగళహారతులతో మహిళల స్వాగతం

గోదావరిఖని: కాంగ్రెస్ అధికారంలోకొచ్చిన వెంటనే రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేసి తీరుతామని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎంఎస్.రాజ్‌ఠాగూర్ తెలిపారు. హాథ్‌సేహాథ్ జోడో కార్యక్రమంలో భాగంగా స్థానిక అడ్డగుంటపల్లి ఏరియాలో సోమవారం పర్యటించారు. కాంగ్రెస్ హయాంలోనే రాష్ట్రం అభివృద్ధి జరిగిందన్నారు. ప్రజలు బీఆర్ఎస్ పాలనతో విసుగు చెందుతున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్‌కు అధికారమిస్తే రూ.500కే సిలిండర్, పేద, సామాన్య ప్రజలకు ఇందిరమ్మ ఇల్లు, లేకుంటే నిర్మాణానికి రూ.5లక్షలు అందిస్తామన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా రూ.5లక్షల వైద్య ఖర్చులకు అందిస్తామన్నారు. స్థానిక ఎమ్మెల్యే ఒక్క డబుల్‌బెడ్‌రూమ్ ఇల్లు ఇవ్వకుండా ప్రజలను నిలువునా మోసం చేశారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చని స్థానిక ఎమ్మెల్యేకి ఓట్లు అడిగే హక్కు లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు బొంతల రాజేశ్, కాల్వ లింగస్వామి, ఎండీ.ముస్తాఫా, మహంకాళీ స్వామి, గాథం విజయానంద్, పెద్దెల్లి ప్రకాశ్, బొమ్మక రాజేశ్, చుక్కల శ్రీనివాస్, నాయిని ఓదెలు, వీరబోయిన రవియాదవ్, తాళ్లపెల్లి యుగేందర్, గట్ల రమేశ్, నజీముద్దీన్, ఆడెపు దశరథం, ఆడెపు రమేశ్, అరికిల్ల బద్రి, గణేశ్, ఆడెపు స్రవంతి, కీర్తి వనిత, తిప్పారపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే బీఆర్ఎస్ ధ్యేయం

- రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్



సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

గోదావరిఖని: నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తెలిపారు. సోమవారం తన క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ కేసీఆర్ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, ఇలాంటివి ఏ రాష్ట్రంలోనూ లేవని తెలిపారు. రైతుబంధు, రైతుబీమా, 24 గంటల ఉచిత విద్యుత్, దళితబంధు, ఆసరా పెన్షన్, కల్యాణలక్ష్మి వంటి పథకాలు ప్రతి ఇంటికీ చేరుతున్నాయని, రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటేసి ఆ రుణాన్ని తీర్చుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం 27మంది లబ్ధిదారులకు రూ.20.12 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. నగర మేయర్ బంగి అనిల్‌కుమార్, కార్పొరేటర్లు ధాతు శ్రీనివాస్, శంకర్‌నాయక్, సాగంటి శంకర్, రాకం లత, జనగామ కవితసరోజిని, నాయకులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా రాణించాలి

అనంతరం గంగానగర్‌లో న్యాక్ కార్యాలయంలో మహిళలకు కుట్టుమిషన్ శిక్షణ సర్టిఫికెట్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. మహిళలకు సేవ చేయాలనే సంకల్పంతో విజయమ్మ ఫౌండేషన్ ద్వారా నియోజకవర్గంలో 90 మహిళా సాధికారత శిక్షణ కేంద్రాలు ప్రారంభించామన్నారు. బ్యూటీషియన్, మగ్గంవర్క్, ఫ్యాషన్ డిజైనింగ్, కుట్టు శిక్షణ ఇస్తున్నామన్నారు.

'స్లాట్'కు తప్పని ఎదురుచూపులు

- నెలకు ఒకసారే స్లాట్ బుకింగ్
- సాఫ్ట్‌వేర్ మాడిఫికేషన్‌తో ఇబ్బందులు
- ప్రతిరోజూ ఉంటేనే అర్హులకు లబ్ధి



ఈయన రాజపోచయ్య. సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి గ్రామం. ఇటీవల గుర్తు తెలియని వాహనం ఢీకొని కాలు విరగడంతో తొలగించారు. సదరం సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు మీసేవ కేంద్రానికి వెళ్లాడు. పత్రాలు అప్‌లోడ్ కాకపోవడంతో ఇబ్బంది పడుతున్నాడు. స్లాట్ బుకింగ్‌కు ప్రభుత్వం అవకాశం కల్పించకపోవడంతో మీ సేవా కేంద్రానికి రావడం.. తిరిగి వెళ్లిపోవడం రాజపోచయ్య వంతవుతోంది. ఈ సమస్య ఇతని ఒక్కడిదే కాదు.. జిల్లావ్యాప్తంగా ఉన్న వందలాది మందిది.



సుల్తానాబాద్ మీసేవా కేంద్రం వద్ద స్లాట్ కోసం నిరీక్షిస్తున్న దివ్యాంగులు

సుల్తానాబాద్: రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన అవయవాలు కోల్పోయినవారికి.. సదరం సర్టిఫికెట్ ఇచ్చి.. పింఛన్ మంజూరు చేస్తుంది ప్రభుత్వం. సదరం శిబిరాలను వైద్యాధికారులు నిర్వహించి వైకల్య శాతాన్ని గుర్తించి దాని ప్రకారం సర్టిఫికెట్ ఇస్తారు. సదరం శిబిరాలకు వెళ్లేందుకు ముందుగా దివ్యాంగులు మీ సేవ కేంద్రాల్లో స్లాట్ బుకింగ్ చేసుకోవాల్సి ఉంటుంది. స్లాట్ బుకింగ్‌కు ప్రతి మూడు నెలలకోసారి ప్రభుత్వం అవకాశం కల్పిస్తుంది. ఇందులో 130 మంది కొత్తవారు.. మరో 130 మంది పాతవారు (రెన్యూవల్) బుకింగ్ చేసుకుంటే వారి పత్రాలు పరిశీలించి సదరం శిబిరాలకు పంపిస్తారు.

మూడు నెలలకోసారి స్లాట్ అవకాశం..

దివ్యాంగుల కోసం ఏటా జనవరి, ఏప్రిల్, జూలై, అక్టోబర్ (మూడు నెలలకోసారి) నెలల మొదటి రోజు స్లాట్లు జారీ చేస్తుంది. దివ్యాంగులు తమ సమీప మీసేవా కేంద్రాలకు వెళ్లి కొత్తవారితోపాటు ఇప్పటికే ధ్రువీకరణ పత్రాలు పొంది.. గడువు తీరిన వారు పునరుద్ధరణ కోసం బుకింగ్ చేసుకోవాలి. బుకింగ్ లభించిన రోజు వారు జిల్లాకేంద్ర ఆస్పత్రిలో సంబంధిత వైకల్య నిర్ధారణ వైద్యుల వద్ద పరీక్షించుకోవాలి. ఈ ఏడాది జనవరి నెలకు సంబంధించి ప్రభుత్వం స్లాట్ బుకింగ్ విడుదల చేయలేదు. దీంతో జిల్లాలోని దివ్యాంగులు, కుటుంబ సభ్యులు కొన్నిరోజులపాటు మీసేవా కేంద్రాల చుట్టూ తిరిగి విసిగిపోయారు. ఈ క్రమంలో ఎలాంటి ప్రకటన చేయకుండానే ఫిబ్రవరిలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ స్లాట్ బుకింగ్‌లను విడుదల చేసింది. ఇందులో కేవలం ఆరు రోజుల శిబిరాలకు మాత్రమే అవకాశం కల్పించడంతో అర్హులు ప్రతి మీ సేవ కేంద్రం వద్దకు పరుగులు తీశారు. అయితే కేవలం 60 మందికి మాత్రమే అవకాశం కల్పించి.. వెబ్‌సైట్‌ను మూసివేయడంతో చాలామంది నిరాశకు గురవుతున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన విధంగా ప్రతి మూడు నెలలకోసారి కాకుండా ఎప్పటికప్పుడు అవకాశం కల్పించాలని దివ్యాంగులు కోరుతున్నారు. మార్చి నెల సమీపిస్తుండడంతో ఫిబ్రవరిలో మిగిలిపోయిన వారితోపాటు కొత్తవారికి అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

సాఫ్ట్‌వేర్ మాడిఫికేషన్‌తో ఇబ్బంది..

స్లాట్ బుకింగ్‌కు దివ్యాంగులు ఇబ్బంది పడొద్దనే ఉద్దేశంతో అధికారులు సాఫ్ట్‌వేర్‌ను మాడిఫికేషన్ చేస్తున్నట్లు సమాచారం. తాత్కాలికంగా ఇబ్బందులు ఎదురైనా భవిష్యత్తులో అందరికీ అవకాశం కల్పిస్తామని జిల్లా అధికారులు చెబుతున్నారు. ఫిబ్రవరి వరకు జిల్లాలో 27,184 మంది దివ్యాంగులకు ఆసరా పింఛన్ అందించినట్లు ఆసరా ఇన్‌చార్జి రమాదేవి తెలిపారు.

స్లాట్‌బుకింగ్ ప్రతిరోజూ ఉండాలి



దివ్యాంగుల కోసం అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలి. సదరం స్లాట్ బుకింగ్ కోసం ప్రతిరోజూ అవకాశం ఇవ్వాలి. మీసేవ కేంద్రాల్లో సైట్ ఓపెన్ అయ్యేలా చర్యలు చేపట్టాలి. ఎప్పుడు స్లాట్ బుకింగ్‌కు అనుమతి ఇస్తారో తేదీలను ఖరారు చేస్తే ఇబ్బందులు రావు. 260 మందికే కాకుండా అర్హులు ఎప్పుడైనా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలి.

– మేకల రాజయ్య యాదవ్, దివ్యాంగుల సంఘం మండల అధ్యక్షుడు సుల్తానాబాద్

నేడు సదరం స్లాట్‌బుకింగ్: డీఆర్‌డీవో

పెద్దపల్లిరూరల్: దివ్యాంగుల నిర్ధారణ పరీక్షలకు మంగళవారం మీసేవా కేంద్రాల్లో స్లాట్‌బుకింగ్ చేసుకోవాలని డీఆర్‌డీఓ శ్రీధర్ కోరారు. కొత్తగా సదరం సర్టిఫికెట్ కావాల్సినవారు, తాత్కాలిక సదరం సర్టిఫికెట్ ఉన్నవారు రెన్యూవల్‌కు దరఖాస్తు చేసుకోవాలని వివరించారు. శారీరక వైకల్యం ఉంటే మార్చి 2, 16, దృష్టిలోపం ఉంటే మార్చి 9, మానసిక వైకల్యం, బుద్ధిమాంద్యం ఉంటే మార్చి 15, వినికిడి లోపం ఉన్నవారు మార్చి 23నాటి స్లాట్ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. క్యాంపులకు వచ్చే సమయంలో రశీదుతోపాటు సర్టిఫికెట్, మెడికల్ రిపోర్టు వెంట తెచ్చుకోవాలని సూచించారు.

క్లుప్తంగా

గంజాయి పట్టివేత



వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ సీఐ గురువయ్య

మంథని: మంథని మండలం మల్లేపల్లి గ్రామంలో గువ్వల వెంకటి ఇంట్లో గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ గురువయ్య తెలిపారు. గ్రామంలోని ఓ వ్యక్తి గంజాయిని విక్రయిస్తున్నాడనే సమాచారం మేరకు సోదాలు నిర్వహించామన్నారు. సోమవారం వెంకటి ఇంట్లో 850 గ్రాముల గంజాయి లభ్యమైనట్లు తెలిపారు. సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు. గంజాయిని పట్టుకోవడంతో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్ఐ సాయిరాంను ఉన్నతాధికారులు అభినందించారు. దాడుల్లో శ్యామ్, శ్రీనివాస్, సతీష్, తదితరులు పాల్గొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

క్షుద్రపూజల కలకలం



సుల్తానాబాద్(పెద్దపల్లి): సుల్తానాబాద్ పట్టణంలో క్షుద్రపూజలు కలకలంరేపాయి. ఆదివారం రాత్రి పట్టణంలోని నీరుకుల్ల వెళ్లే రహదారి సమీపంలో పసుపు, కుంకుమ, నిమ్మకాయలు, కోడిని పెట్టి పూజలు చేసిన ఆనవాళ్లను సోమవారం వేకువజామున పంట పొలాలకు వెళ్లే రైతులు గమనించి స్థానికులకు సమాచారం అందించారు. ప్రతీ ఆది, బుధవారాల్లో క్షుద్రపూజలు చేస్తుండడంతో అటువైపు వెళ్లేవారు ఆందోళన చెందుతున్నారు. ఆధునిక కాలంలో సైతం మూఢనమ్మకాలు, భానుమతి క్షుద్రపూజల పేరిట ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్న వారిని అధికారులు గుర్తించి ఇలాంటివి జరగకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

కుక్కలకు అంతుచిక్కని వ్యాధి



కమాన్‌పూర్‌లో వ్యాధి బారిన పడిన కుక్క

కమాన్‌పూర్(మంథని): మండల కేంద్రంలో వీధి కుక్కలు కొద్దిరోజులుగా వింత వ్యాధి బారినపడ్డాయి. అవి దారి వెంట తిరుగుతుండంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వ్యాధి సోకిన కుక్కలకు వెంట్రుకలు, శరీరం ఊడిపోతుంది. అవి జంతువులు, ప్రజలను కరిస్తే పరిస్థితి ఏంటని జనం భయపడుతున్నారు.

108 అంబులెన్సులో ప్రసవం

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): మండలంలోని చిన్నరాతుపల్లి గ్రామానికి చెందిన బండి శ్రావణికి ఆదివారం రాత్రి పురిటి నొప్పులు రావడంతో శ్రీరాంపూర్ హాస్పిటల్‌కు తరలించారు. కానీ నెలలు పూర్తిగా నిండకపోవడంతో పెద్దపల్లి మాతాశిశు కేంద్రానికి తరలించేందుకు ఓదెల మండలానికి చెందిన 108 అంబులెన్సుకు సమాచారం అందించారు. ఈక్రమంలో శ్రావణిని అంబులెన్సులో తరలిస్తుండగా మార్గమధ్యలో నొప్పులు అధికం కావడంతో అంబులెన్సులోనే సాధారణ ప్రసవం చేయగా మగ శిశువుకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డను పెద్దపల్లి మాతా శిశు కేంద్రానికి తరలించారు. ఈసందర్భంగా 108 ఐఎంటీ మహేందర్, పైలట్ గురునాథ్‌కు శ్రావణి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

కరాటే శిక్షణ.. ఆత్మరక్షణ

- జిల్లాలోని 90 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో శిక్షణ
- ఉదయం, సాయంత్రం వేళ తర్ఫీదు
- నేడు ముగియనున్న శిక్షణ తరగతులు



కరాటేలో సాధన చేస్తున్న విద్యార్థినులు

సుల్తానాబాద్(పెద్దపల్లి): విద్యార్థినుల్లో ఆత్మస్థైర్యం నింపేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థినుల ఆత్మరక్షణకు కరాటేలో మెలకువలు నేర్పేందుకు ఉదయం, సాయంత్రం వేళల్లో శిక్షణ తరగతులను గత నెల 24న మొదలుపెట్టింది. నాలుగేళ్ల కిందట బాలికలకు కరాటే శిక్షణ ఇవ్వగా పలు కారణాలతో నిలిచిపోయింది. మళ్లీ జిల్లాలోని 90 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పునరుద్ధరించారు. కాగా నేటితో శిక్షణ తరగతులు ముగియనున్నాయి.

90 ప్రభుత్వ పాఠశాలల్లో..

ప్రభుత్వ నిర్ణయంతో జిల్లాలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థినులు చదువుతో పాటు కరాటేలో శిక్షణ పొందేందుకు అవకాశం దక్కింది. జిల్లావ్యాప్తంగా 203 సర్కారు బడులు ఉన్నాయి. తొలి విడతలో ఎంపిక చేసిన 90 జెడ్పీ బాలికల ఉన్నత, కస్తూరిబా, ప్రాథమికోన్నత పాఠశాలల్లో కరాటేలో మెలకువలు నేర్పిస్తున్నారు. గత నెల 24న జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా శిక్షణ తరగతులు ప్రారంభించారు. కరాటేలో శిక్షణ ఇచ్చినందుకు ఇన్‌స్ట్రక్టర్లకు నెలకు గౌరవ వేతనం ఏజెన్సీల ద్వారా రూ.5వేలు అందనున్నాయి. శిక్షణ పూర్తి చేశారని సంబంధిత హెచ్‌ఎంలు సర్టిఫికెట్ ఇస్తేనే వేతనం ఇవ్వనున్నారు. రూ.5 వేల చొప్పున పాఠశాల నుంచి చెల్లించేలా రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది.

ధీమా పెంచేలా..

ఏదైనా అనుకోని ఘటన ఎదురైతే బాలికలు తమని తాము రక్షించుకునే ఆత్మవిశ్వాసం, ధీమా పెంచేందుకు కరాటే శిక్షణ తోడ్పడుతుంది. ఇప్పటికే పట్టణాల్లో కొంతమంది ప్రైవేటుగా ఫీజు చెల్లిస్తూ కరాటేలో శిక్షణ పొందుతున్నారు. గతంలో సర్వశిక్షా అభియాన్ ద్వారా నిధులిచ్చి తరగతులు నిర్వహించారు. కానీ కరోనా ప్రభావం అనంతరం ఇది కాస్త అటకెక్కింది. యుద్ధ విద్యలైన కుంగ్‌ఫూ, కరాటే, జూడో వంటివి నేర్పించేలా శిక్షకులను నియమించారు. కాగా కనీసం ఆరునెలల పాటు అవకాశం కల్పిస్తే విద్యార్థులు ఏమైనా నేర్చుకునే అవకాశం ఉంటుందని శిక్షకులు పేర్కొంటున్నారు.

కరాటేతో ఆత్మవిశ్వాసం



కరాటే నేర్చుకోవడం వల్ల బాలికలకు ఆత్మ విశ్వాసం పెరుగుతుంది. కటాస్ నేర్పడంతోపాటు ఎదుటివారు దాడులు చేసినప్పుడు ఎలా రక్షించుకోవాలో మెలకువలు నేర్పించాం. ప్రభుత్వం కొద్దిరోజులు శిక్షణ కాలం పెంచితే బాగుండేది.

– కనకేశ్, కరాటే మాస్టర్, సుల్తానాబాద్

ఏ రంగంలోనైనా..



జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన పాఠశాలల్లో బాలికలకు ఉచిత కరాటే శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నాం. కరాటే శిక్షణ పిల్ల ల్లో నమ్మకం పెంచుతుంది. ఆపద సమయంలో ఉపయోగపడుతుంది. దీంతో ఏ రంగాల్లోనైనా రాణించే అవకాశం ఏర్పడుతుంది.

– మాధవి, జిల్లా విద్యాధికారి

మెలకువలు నేర్చుకున్నాం



కరాటేలో మెలకులు నేర్చుకున్నాం. ఆత్మ విశ్వాసం పెరిగేందుకు దోహదపడుతుందని భావిస్తున్నా. మూడు నెలల శిక్షణ కాలం ఉంటే బాగుండేది. ప్రభుత్వం ఆ దిశగా కొనసాగిస్తే మరిన్ని మెలకువలు నేర్చుకుంటాం.

– సాహిత్య, 9వ తరగతి, సుల్తానాబాద్

హాస్టల్‌లో భోజనం తినలేకపోతున్నాం..!





రాజీవ్ రహదారిపై విద్యార్థులు, కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై

- ధర్నా చేసేందుకు రోడ్డెక్కిన విద్యార్థులు
- విద్యార్థులను బతిమాలిన వార్డెన్
- కౌన్సెలింగ్ ఇచ్చిన ఎస్సై రాజేశ్

పెద్దపల్లిరూరల్: 'హాస్టల్‌లో భోజనం సరిగా వండడం లేదు.. అన్నంలో పురుగులొస్తున్నాయి. నీళ్లచారు.. ఉడికి ఉడకని పప్పులు, కూరలు వండుతున్నారు. ఆ భోజనం తినలేకపోతున్నాం..' అంటూ పెద్దపల్లి శివారు రంగంపల్లిలోని బాలుర కళాశాల హాస్టల్ విద్యార్థులు సోమవారం రాత్రి రోడ్డెక్కారు. ధర్నా చేసేందుకు సిద్ధమయ్యారు. వారికి విద్యార్థి సంఘాల నాయకులు మద్దతు తెలపడంతో అందరూ కలిసి జిల్లాకేంద్రంలోని కమాన్ ప్రాంతానికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న హాస్టల్ వార్డెన్ అశోక్ వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని విద్యార్థులతోపాటు.. విద్యార్థి సంఘాల నాయకులతో మాట్లాడారు. సమస్య చెబితే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థులు వినిపించుకోకపోవడంతో కలెక్టరేట్ ముందు నిరసన తెలిపేందుకు బయల్దేరారు. చీకురాయి క్రాస్‌రోడ్డు వద్దకు చేరుకోగానే ఎస్సై రాజేశ్ వచ్చి విద్యార్థులతో మాట్లాడారు. ఆదివారం కూరలు సరిగా వండలేదని, వార్డెన్‌కు చెబుతామంటే అందుబాటులో లేడని, కనీసం ఫోన్ కూడా లిఫ్ట్ చేయలేదని విద్యార్థులు పేర్కొన్నారు. సమస్యలు, ఇబ్బందులు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలిగానీ.. ఇలా రాత్రి సమయాల్లో రోడ్లపైకి చేరడం సరికాదని విద్యార్థులతోపాటు విద్యార్థి సంఘాల నాయకులకు కౌన్సెలింగ్ ఇచ్చి తిరిగి హాస్టల్‌కు పంపించారు. సమస్యలను తన దృష్టికి తేవాల్సిందని, రోడ్డుపైకి రావడం సరికాదని వార్డెన్ అన్నారు. లోటుపాట్లుంటే తమ దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులు పరిష్కరించండి

- సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ ఆదేశం



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ సంగీత

పెద్దపల్లిరూరల్: ప్రజావాణి ఫిర్యాదులకు పరిష్కారం చూపాలని కలెక్టర్ సంగీత సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్, అడిషనల్ కలెక్టర్లు లక్ష్మీనారాయణ, కుమార్‌దీపక్ 44 వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఫిర్యాదులను పరిష్కరించినా లేదా తిరస్కరించడానికి గల కారణాలను వివరిస్తూ సంబంధిత ఫిర్యాదుదారులకు సమాచారమందించాలని సూచించారు. ఫిర్యాదులను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటానన్నారు. పెద్దపల్లి మండలం రాగినేడు గ్రామ శివారులోని దొంగబోరు ప్రాంత ప్రభుత్వ భూమి నుంచి విలువైన మట్టిని కొందరు అక్రమార్కులు రాత్రి సమయాల్లో తరలించుకపోతున్నారని బీజేపీ నాయకుడు తంగెడ రాజేశ్వర్‌రావు ఫిర్యాదు చేశాడు.. రామగుండం మండలం జనగామలో సర్వే నంబరు 427లో 45 ఎకరాల భూమిని సింగరేణి అధికారులు 33 ఎకరాలుగా చూపుతున్నారని రెవెన్యూ అధికారులచే విచారణ జరిపించి సవరించాలని రైతులు ప్రజావాణిలో కోరారు. పెద్దపల్లి మండలం గౌరెడ్డిపేట శివారులో సర్వే నంబరు 91లో మూడెకరాల14గుంటల భూమిలో పంట సాగు చేసుకుంటున్నా, పక్కనే ఇటుకబట్టీ పెట్టడంతో దుమ్ము, బూడిద, పొగ చూరి పంటకు నష్టం జరుగుతోందని, సదరు బట్టీ యజమానిపై చర్యలు తీసుకుని పంటను కాపాడాలంటూ గ్రామానికి చెందిన కొమ్ము సురేశ్ ఫిర్యాదులో కోరారు. కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రపంచ పద్మశాలీ సదస్సులో 'బొద్దుల'



జూలపల్లి/సుల్తానాబాద్: దుబాయిలో జరుగుతున్న ప్రపంచ పద్మశాలీ సదస్సులో జూలపల్లి జెడ్పీటీసీ, పద్మశాలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కేసీఆర్ సేవాదళం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొద్దుల లక్ష్మణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సదస్సులో పద్మశాలీ సమాజం ఎదుర్కొంటున్న రాజకీయ, ఆర్థిక సామాజిక అంశాలపై మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పద్మశాలీలు ఏకతాటిపైకి రావాలన్నారు. సదస్సులో ఎమ్మెల్సీ ఎల్.రమణ, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, టెక్స్‌టైల్స్ అండ్ పవర్‌లూమ్స్ కార్పొరేషన్ చైర్మన్ గుడూరి ప్రవీణ్‌కుమార్, ఆలిండియా పద్మశాలీ సంఘం అధ్యక్షుడు కందగట్ల స్వామి, ప్రపంచవ్యాప్తంగా ఉన్న సంఘ ప్రముఖులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ



జ్యోతినగర్(రామగుండం): గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఇండోర్ స్టేడియంలో సుమన్ సోత్కర్ స్పోర్ట్స్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన జాతీయస్థాయి కరాటే కుంగ్–ఫూ ఛాంపియన్‌షిప్–2023 పోటీల్లో విద్యార్థులు ప్రతిభ చాటారు. హుయాన్ చింగ్ కుంగ్–ఫూ ఇంటర్నేషనల్ అకాడమీలో శిక్షణ పొందుతున్న ఎన్టీపీసీ మాతృమందిరం పాఠశాల విద్యార్థులు పతకాలు సాధించారు. విజేతలను సినీ హీరో సుమన్, మధు, కుంగ్–ఫూ మాస్టర్ రాజేశం, ఉపాధ్యాయులు అభినందించారు.

క్రీడాకారుడికి సన్మానం



మనోహర్‌రావును సన్మానిస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: జాతీయస్థాయి మాస్టర్ అథ్లెటిక్ పోటీల్లో ప్రతిభ చూపి ప్రథమస్థానంలో నిలిచిన క్రీడాకారుడు తూముల మనోహర్‌రావును సోమవారం మున్నూరు కాపు సంఘ నాయకులు, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎల్.రాజయ్య, ఉప్పురాజు తదితరులు ఘనంగా సత్కరించారు. ఇప్పటికే అథ్లెటిక్‌లో అనేక పతకాలు సాధించిన మనోహర్‌రావు కోల్‌కతాలో ఈనెల 14 నుంచి 18వరకు జరిగిన పోటీల్లో హ్యామర్‌త్రో విభాగంలో ప్రతిభ కనబర్చి ఫిలిప్పిన్స్‌లో జరగనున్న అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మల్క రామస్వామి, తూముల శ్రీనివాస్, కౌన్సిలర్ సుభాష్‌రావు, నాయకులు మల్క రాజేశం, గందు రంగయ్య, తిరుపతి, భూమయ్య, శ్రీనివాస్, రాజేశం, అమిరిశెట్టి రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

ADMISSIONS FOR GUIDENCE

■ Admissions for Guidence B.Tech/M.Tech/M.B.A, LLB / B.Sc, M.Sc Agri, P.G (All), Ph.d Few Seats Available. Cont: 9391471754, 8985533447, Hyd. [W-775785]

SERVICES

■ వ్యక్తిగత, వ్యాపారం, వ్యవసాయ ఆస్తి, టెక్‌ఓవర్ లోన్, NPA కేసులు తక్కువ సిబిల్ స్కోర్ కూడా రుణానికి వర్తిస్తాయి. సంప్ర: 94630 26237 [T-P1751]

మూలికావైద్యం

■ అంగస్తంభన లేకపోవటం, సెక్స్‌లో ఎక్కువసేపు చేయలేకపోవడం, అంగం లావుగా, దృఢంగా, బలంగా ఉండుటకు మూలికౌషధం, వయస్సు పైబడిన వారు కూడా వాడవచ్చు. డా.సి.హెచ్. రామకృష్ణ, VJA. ఫోన్: 84650 56299 [V-5638]

WANTED

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-781850]

■ పనివారు కావలెను. హైదరాబాద్, భువనగిరిలో గల చిన్న కుటుంబానికి ఇంట్లోనే ఉండి వంటపని, ఇంటిపని, డ్రైవింగ్, గార్డెనింగ్ మొ॥ పనులు చేయుటకు భార్యాభర్తలు కావలెను. డి.బాలాజీ, భువనగిరి. ఫోన్: 92469 69042, 98481 75211 [V- 1767]

www.sakshi.com

For Classifieds, Advertisements Contact: 9951602933 9951602824

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

బొగ్గుబాయి వార్తలు

అండర్‌గ్రౌండ్ కార్మికులు ఐక్యంగా ఉండాలి



సమావేశంలో అండర్ గ్రౌండ్ కార్మికులు

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): సింగరేణిలో పనిచేస్తున్న అండర్ గ్రౌండ్ జనరల్ మజ్దూర్ కార్మికులందరూ ఐకమత్యంగా ఉండాలని 7ఎల్‌పీ, వకీల్‌పల్లి గని అండర్ గ్రౌండ్ కార్మికులు అన్నారు. సోమవారం ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ ప్రెస్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కంపెనీ అవసర నిమిత్తం 7ఎల్‌పీ, వకీల్‌పల్లి గని అండర్‌గ్రౌండ్ కార్మికులను సీనియారిటీ పేరుతో 40 మందిని డిప్యూటేషన్ ద్వారా ఓసీపీ–3 లో వివిధ డిపార్ట్ సర్ఫేస్‌గా 3 నెలలు అని చెప్పి 4 ఏళ్లుగా వాడుకున్నారన్నారు. ప్రస్తుతం తిరిగి అండర్ గ్రౌండ్‌కు పంపిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని పలు సంఘాల నాయకులకు చెప్పినా పట్టించుకోకపోవడంతో హెచ్‌ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్‌ను కలిసి సమస్యను వివరించగా సింగరేణి యాజమాన్యంతో మాట్లాడారని, ఎక్కడ పనిచేస్తే అక్కడే వారిని పర్మినెంట్ చేయాలని యాజమాన్యంతో చెప్పినట్లు వివరించారు. మిగతా కార్మిక సంఘాలు కార్మికులను రెచ్చగొట్టి వారి ఐక్యతను విడగొడుతున్నారని ఆరోపించారు. కార్మికులందరూ కలసి రావాలని కోరారు. సమావేశంలో బచ్చల రాజేష్, రవికుమార్, కుమార్, చరణ్‌తేజ్, కనకం రాజేష్, శంకర్, సాగర్, తీగల శంకర్, నాగేష్, తిరుపతి, శ్రీనివాస్, నిజాముద్దీన్, కిరణ్, ఓంకార్, బండి రాజేష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మెతోనే ఓబీ కార్మికుల సమస్యలు పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న కౌశిక్‌హరి

గోదావరిఖని(రామగుండం): కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారానికి సమ్మె చేయడమే ఏకైక మార్గమని కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ నాయకుడు కౌశిక్‌హరి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక మార్కండేయకాలనీలోని బృందావన్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన ఓసీపీ కార్మికుల అఖిలపక్ష కమిటీ సమావేశంలో మాట్లాడారు. సమస్యల పరిష్కారం కోసం మార్చి 6 నుంచి సమ్మెలోకి వెళ్లనున్నట్లు, దీనికి కార్మికులు పూర్తి స్థాయిలో మద్దతు ప్రకటించాలని కోరారు. సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు సమ్మె కొనసాగిస్తామన్నారు. సమావేశంలో జేఏసీ నాయకులు ఏఐటీయూసీ నుంచి బుర్ర తిరుపతి, సీఐటీయూ వేల్పుల కుమారస్వామి, ఐఎన్‌టీయూసీ పూసాల తిరుపతి, ఐఎఫ్‌టీయూ(ఎన్‌డీ) ఎ.వెంకన్న, ఐఎఫ్‌టీయూ ప్రజాపంథా తోకల రమేష్, టీసీకేఎస్ మద్దెల శ్రీనివాస్, ఏఐటీయూసీ ఎంఏ గౌస్, బీజేపీ మహవాది రామన్న, ఏఐటీయూసీ శనిగల శ్రీనివాస్, ఓబీ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సూటబుల్ జాబ్ ఇవ్వాలి



మాట్లాడుతున్న రాంచందర్

రామగిరి(మంథని): సింగరేణిలో పని చేస్తూ మెడికల్ అన్‌ఫిట్ అయిన ట్రేడ్‌మెన్స్, ఈఅండ్‌ఎం సూపర్‌వైజర్లకు సూటబుల్ జాబ్ ఇవ్వాలని ఏఐటీయూసీ ఆర్జీ–3 బ్రాంచ్ కార్యదర్శి జూపాక రాంచందర్ డిమాండ్ చేశారు. సెంటినరీకాలనీలోని ఏఐటీయూసీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బొగ్గు ఉత్పత్తిలో ప్రధాన భూమిక పోషిస్తున్న ట్రేడ్‌మెన్స్, ఈఅండ్‌ఎం సూపర్‌వైజర్స్, టెక్నీషియన్స్ వివిధ జబ్బుల వల్ల మెడికల్ అన్ ఫిట్ అయితే సర్ఫేస్ జనరల్ మజ్దూర్‌గా విధుల్లోకి తీసుకోవడం దుర్మార్గమైన చర్య అని ఖండించారు. ఏఐటీయూసీ సింగరేణిలో గుర్తింపు సంఘంగా ఉన్న సమయంలో అన్‌ఫిట్ అయిన ట్రేడ్స్ మెన్స్, సూపర్‌వైజర్స్, మైనింగ్ స్టాఫ్‌నకు సూటబుల్ జాబ్ ఇప్పించినట్లు గుర్తు చేశారు. గుర్తింపు సంఘంగా ఉన్న టీబీజీకేఎస్ చేతకాని తనం వల్ల మెడికల్ అన్‌ఫిట్ అయినవారికి జనరల్ మజ్దూర్లుగా విధులు నిర్వహించాల్సిన దుస్థితి నెలకొందని ఎద్దేవా చేశారు. యాజమాన్యం ఉత్పత్తి మీద ఉన్న శ్రద్ధ కార్మికుల ప్రాణాలపై చూపడం లేదని మండిపడ్డారు. ప్రాణాలను పణంగా పెట్టి ఉత్పత్తిలో కీలక పాత్ర పోషిస్తున్న మైనింగ్ సిబ్బంది, సూపర్‌వైజర్స్, ట్రేడ్స్‌మెన్స్‌కు సర్ఫేస్‌లో సూటబుల్ జాబ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీనిపై యాజమాన్యం స్పందించకుంటే సింగరేణి వ్యాప్తంగా భవిష్యత్తు కార్యాచరణ రూపొందించడం జరుగుతుందని, కార్మికులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘం ట్రేడ్స్‌మెన్ ఇన్‌చార్జి మర్రి రాజు, కన్వీనర్ ఇప్ప గంగాధర్, బ్రాంచ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ మందల రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులను బలి తీసుకున్నవారిని శిక్షించాలి



రమేశ్

రామగిరి(మంథని): ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మెడికో విద్యార్థి ప్రీతి, ఇంజినీరింగ్ విద్యార్థి రక్షిత మృతికి కారకులైన నిందితులను కఠినంగా శిక్షించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు రత్నం రమేశ్ డిమాండ్ చేశారు. సోమవారం సెంటినరీకాలనీలో మాట్లాడారు. గిరిజన కుటుంబానికి చెందిన ప్రీతి సైఫ్ వేధింపులకు తాళలేక అర్ధాంతరంగా తనువు చాలించడం విషాదకరమన్నారు. కేఎంసీ ప్రిన్సిపాల్, హెచ్ఓడీ, స్థానిక పోలీసులతోపాటు విద్యాసంస్థల్లో ర్యాగింగ్ నియంత్రించలేని రాష్ట్ర ప్రభుత్వం ప్రీతి మరణానికి పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఇంజినీరింగ్ విద్యార్థిని రక్షితను ర్యాగింగ్ చేయడంతో ఉరేసుకుని చనిపోవడం బాధాకరమని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు.

మాయమాటలతో మోసం చేస్తున్న ప్రభుత్వం

- మాజీ ఎమ్మెల్యే విజయరమణరావు



కోనరావుపేటలో పర్యటిస్తున్న విజయరమణరావు

జూలపల్లి: బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా.. మాయమాటలతో ప్రజలను మోసం చేస్తోందని మాజీ ఎమ్మెల్యే విజయరమణరావు ఆరోపించారు. గడపగడపకూ కాంగ్రెస్, పల్లెపల్లెకూ విజ్జన్న కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని కోనరావుపేట, పెద్దాపూర్‌లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలు వివరించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. డబుల్ బెడ్ రూం ఇళ్లు, రుణమాఫీ, నిరుద్యోగ భృతి మర్చిపోయారని తెలిపారు. కరెంటు, కాలువ నీళ్లు ఎప్పుడొస్తాయో తెలియని పరిస్థితి ఉందన్నారు. స్థానిక ఎమ్మెల్యేకు డి–83, డి–86 కాలువలు కూడా తెలియవని, నీళ్లు వస్తే పూలు, కుంకుమ, పసుపు చల్లడం మాత్రమే తెలుసని ఎద్దేవా చేశారు. నాయకులు మెతుకు కాంతయ్య, బండి స్వామి, మాంకాళి అంజయ్య, కొండ్ర సంతోష్, కనకట్ల నర్సింగం, కన్నం స్వామి, కందుకూరి అంజయ్య, మాజీ ఎంపీటీసీ అంజయ్య, శంకరయ్య, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

రైతులకు సాగునీరు అందించాలి

- జగిత్యాల డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



పంప్‌హౌజ్‌ను పరిశీలిస్తున్న లక్ష్మణ్‌కుమార్, రైతులు

పాలకుర్తి(రామగుండం): పాలకుర్తి మండల పరిధిలోని మారేడుపల్లి, ముంజంపల్లి, ఉండేడ, వేంనూర్ గ్రామాల రైతుల ఆయకట్టుకు వేంనూర్ పంప్‌హౌజ్ ద్వారా సాగునీటిని అందించాలని కాంగ్రెస్ పార్టీ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆయా గ్రామాల రైతులతో కలిసి వేంనూర్ పంప్‌హౌజ్‌ను సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, మారేడుపల్లి, ముంజంపల్లి, ఉండేడ గ్రామాలకు చెందిన దాదాపు 400 ఎకరాల పంటభూమి సాగునీరు అందక ఎండిపోయే పరిస్థితి నెలకొందన్నారు. అధికారులు, పాలకులు స్పందించి వేంనూర్ పంప్‌హౌజ్ ద్వారా నీటిని అందించాలన్నారు. ఈ సమస్యపై గతంలో అధికారులు, జిల్లా మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు సైతం రైతులు విన్నవించినా సమస్య మాత్రం పరిష్కారానికి నోచుకోలేదని ఆరోపించారు. ఇప్పటికైనా రైతులకు సకాలంలో సాగునీరు అందించకుంటే కాంగ్రెస్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు లింగారెడ్డి, బాలసాని మల్లేషం, వ్యాళ్ల అనిల్, పూదరి రమేష్, వెంకటస్వామి, శ్రీనివాస్, విజయ్, సాయికుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

ఈపీఎఫ్ సమస్యలు పరిష్కరించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న మోహన్‌రెడ్డి

సుల్తానాబాద్(పెద్దపల్లి): ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ (ఈపీఎఫ్) సమస్యలు పరిష్కరించుకోవాలని ఈపీఈఓ నోడల్ ఆఫీసర్ ఏనుగు మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం సుల్తానాబాద్ పట్టణంలోని విజ్ఞాన్ హైస్కూల్‌లో ఈపీఎఫ్ ఖాతాదారులు, ఉద్యోగులు, పింఛనుదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్మికులు, పెన్షన్‌దారులు, ఉద్యోగులు సమస్యల పరిష్కారం కోసం ఆన్‌లైన్ క్లెయిమ్ సేవలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో కేశవరెడ్డి, బుచ్చిరెడ్డి, మాటేటి సంజీవ్, కేశవరావు తదితరులు పాల్గొన్నారు.